
ప్రజాశక్తి

సోమవారం 13 ఫిబ్రవరి 2023 5

పార్వతీపురం మన్యం



నేడు యథావిధిగా స్పందన

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

స్పందన కార్యక్రమాన్ని సోమవారం యథావిధిగా కొనసాగిస్తున్నట్లు కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన జారీ చేస్తూ స్పందన కార్యక్రమం నిర్వహణకు అనుగుణంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఉత్తర్వులు జారీ చేశారని అన్నారు. ఎన్నికల నియమావళికి అనుగుణంగా జిల్లా, మండల, గ్రామస్థాయి అధికారులు, సిబ్బంది దీన్ని అమలుపర్చాలని ఆయన ఆదేశించారు. కావున సోమవారం స్పందన కార్యక్రమం యథావిధిగా జరుగుతుందని, కావున ప్రజలు దీన్ని గమనించాలని కోరారు.

పార్లమెంటుకా? అసెంబ్లీకా?

- రానున్న ఎన్నికల్లో రాజన్నదొర ప్రయాణంపై చర్చ
- నేడు అమరావతిలో వైసిపి వర్క్ షాప్
- అభ్యర్థులను ఖరారు చేస్తారనే ఊహాగానాలు



ప్రజాశక్తి -సాలూరు

డిప్యూటీ సిఎం పీడిక రాజన్నదొర రానున్న ఎన్నికల్లో ఎటు ప్రయాణిస్తారనే దానిపై చర్చోపచర్చలు సాగుతున్నాయి. వైసిపి తరపున ఆయన పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేస్తారా, మళ్లీ ఎమ్మెల్యేగా నిలబడతారా అన్న అంశంపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. నాలుగుసార్లు ఎమ్మెల్యే అయిన రాజన్నదొర డిప్యూటీ సిఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పదవులను అలంకరించారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఏర్పడిన తొలి విడత కేబినెట్‌లోనే ఆయనకు బెర్త్ ఖరారవుతుందని భావించారు. అయితే అనూహ్య రాజకీయ పరిణామాల నేపథ్యంలో రెండో విడతలో ఆయనకు మంత్రివర్గంలో స్థానం దక్కింది. మరో ఆరు నెలల్లో గాని, ఏడాదిలో గాని అసెంబ్లీ ఎన్నికలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. కావున ఇప్పటి నుంచే వైసిపి నాయకత్వం పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ సమన్వయకర్తలకు గడపగడపకూ ప్రభుత్వం అనే పరీక్ష పెట్టింది. గత ఏడాది మే నెల నుంచి ఈ కార్యక్రమాన్ని రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాల్లోనూ సంబంధిత ఎమ్మెల్యేలు, సమన్వయకర్త లు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల లబ్ధి గురించి వివరిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సిఎం జగన్‌మోహన్ రెడ్డి ఎమ్మెల్యేలు, మంత్రులు, సమన్వయకర్తలకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా ఎమ్మెల్యే లకు వచ్చిన మార్కులు, పార్టీ అంతర్గత సర్వే నివేదికల ఆధారంగా అభ్యర్థులను ఖరారు చేస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది. గతంలో జరిగిన పార్టీ వర్క్‌షాప్‌ల్లో కూడా సిఎం జగన్ ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. పార్టీ అధినేత ఆదేశాల మేరకు డిప్యూటీ సిఎం రాజన్నదొర మేనెల నుంచి గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేల్లో ఆయన ముందంజలో వున్నారు. అయితే గత ఏడాది డిసెంబర్‌లో జరిగిన వర్క్ షాప్‌లో సిఎం జగన్ రాజన్నదొర పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేయడం చర్చనీయాంశమైంది. గడపగడపకూ ప్రభుత్వంలో ఆయన రోజుకు రెండు గంటలే తిరుగుతున్నారనే మాట సిఎం నోట వెంట రావడం రాజన్నదొరతో పాటు వైసిపి శ్రేణులను ఆశ్చర్యానికి గురి చేసింది. పార్టీ అంతర్గత సర్వేల్లో రాజన్నదొర పనితీరును వాస్తవ పరిస్థితి కంటే తక్కువ అంచనా వేశారనే ప్రచారం జరుగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో సోమవారం అమరావతిలో నిర్వహించనున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, సమన్వయకర్తల వర్క్ షాప్‌లో వారి పనితీరుపై సిఎం జగన్ స్పష్టత ఇస్తారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ దఫా వర్క్ షాప్‌లో పనితీరు బాగోలేదని, మెరుగుపర్చుకోని ఎమ్మెల్యేలు మంత్రుల పేర్లు బయటపెడతారనే చర్చ జరుగుతోంది. తాజా పరిస్థితుల్లో జరగనున్న వర్క్ షాప్‌లో సీఎం రాజన్నదొర భవితవ్యం ఏమిటనేది తేలిపోనుంది. నాలుగుసార్లు ఎమ్మెల్యే అయిన రాజన్నదొరకు ఎంపి కావాలనే కోరిక బలంగా ఉంది. అసెంబ్లీ నియోజకవర్గ రాజకీయాలతో అలసిపోయిన రాజన్నదొర ఢిల్లీ వైపు చూస్తున్నారు. గత ఎన్నికల సమయంలోనూ ఆయన ఎంపి కావాలనే కోరిక వ్యక్తం చేశారు. అయితే పార్టీ నాయకులు, కార్యకర్తల ఒత్తిడి మేరకు ఎమ్మెల్యేగానే పోటీ చేశారు. రానున్న ఎన్నికల్లోనైనా ఎంపి సీటు దక్కుతుందా అనే ఆశతో ఆయన ఉన్నారు. అయితే రానున్న ఎన్నికలు అధికారపార్టీ, ప్రధాన ప్రతిపక్ష పార్టీకి జీవన్మరణ సమస్యగా పరిణమిస్తున్న తరుణంలో వైసిపి అధిష్టానం ఆయన్ను ఎమ్మెల్యే అభ్యర్థిగానే రంగంలోకి దించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. నియోజకవర్గంలో టిడిపి నాయకుల మధ్య గ్రూపు రాజకీయాలు, ఆపార్టీ కేడర్‌లో నిరాశ నిస్పృహలు అధికారపార్టీకి బాగా కలిసొచ్చే అంశాలుగా ఉన్నాయి. గత ఎన్నికల్లో ఇవే అంశాలు ఎమ్మెల్యే రాజన్నదొర గెలుపునకు పని చేశాయి. రానున్న ఎన్నికల్లోనూ అనుకూల అంశాలుగా కనిపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఆయన ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉంటే గెలుపు సునాయాసమవుతుందనే చర్చ పార్టీ శ్రేణుల్లో నడుస్తోంది. ఎంపీ సీట్లు కన్నా ఎమ్మెల్యే సీట్లు ఎక్కువ వైసిపికి అవసరం కానున్న నేపథ్యంలో రాజన్నదొర అసెంబ్లీ అభ్యర్థిగానే బరిలో ఉంటారని కొంతమంది వైసిపి నాయకులు వాదిస్తున్నారు. రాష్ట్రంలో అధికారంలోకి మళ్లీ రావాలంటే సీనియర్లు అసెంబ్లీ బరిలో నే వుండాలని అధిష్టానం భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే రాజన్నదొర ఢిల్లీ కోరిక ఈసారైనా నెరవేరుతుందా, ఐదోసారి కూడా అసెంబ్లీ కే పరిమితమవుతారా అన్నది తేలాల్సి ఉంది.



ప్రజ్ఞా వికాస పరీక్ష కరపత్రాలను విడుదల చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ, యుటిఎఫ్ నాయకులు

ఎస్‌ఎఫ్‌ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యాన

26న ప్రజ్ఞా వికాస పరీక్ష

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

పదో తరగతి విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు ఎస్‌ఎఫ్‌ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా ప్రజ్ఞా వికాస పరీక్ష ఈనెల 26న జిల్లా వ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందని, ఈ పరీక్షల్లో టెన్త్ విద్యార్థులంతా పాల్గొవాలని ఎస్‌ఎఫ్‌ఐ, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు పి.రాజశేఖర్, ఎస్.మురళీమోహన్ పిలుపు నిచ్చారు. ఈ మేరకు ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో పరీక్షకు సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు, ఉపాధ్యాయుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ, యుటిఎఫ్ విద్యారంగం అభివృద్ధికి పోరాటాలే కాకుండా అనేక సూచనలు, ప్రత్యామ్నాయ విధానాలు సూచిస్తున్నాయని అన్నారు. పదో తరగతి విద్యార్థులను చదువుల్లో ప్రోత్సహించేందుకు ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు పర్యవేక్షణలో ఈనెల 26న జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల వారీగా ప్రజ్ఞా వికాస పరీక్షలు నిర్వహిస్తున్నామని,ప్రవేశ రుసుంగా రూ.25 చెల్లించి హాల్ టికెట్లు పొందాలని తెలిపారు. తెలుగు10, హిందీ10, ఇంగ్లీష్ 20, మాథ్స్ 20, పిఎస్ 10, ఎన్.ఎస్ 10, సోషల్ 20 మార్కుల రూపంలో ఈ పరీక్ష పేపరు ఉంటుందన్నారు. వీటిలో జిల్లా స్థాయిలో ఉత్తీర్ణత సాధించిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలు, మెమోంటో అందజేస్తామన్నారు. అలాగే మండల స్థాయిలో మొదటి మూడు స్థానాలకు మెమోంటో అందిస్తామన్నారు. మరింత సమాచారానికి 7671994813, 9441969693 నెంబర్లకు సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ, యుటిఎఫ్ నాయకులు సిహెచ్ సింహాచలం, రాజేంద్ర, నవీన్, టి.రమేష్, జ్యోతి, భాస్కరరావు, కె.మురళి తదితరులు పాల్గొన్నారు.



న్యాయమూర్తిని సన్మానిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర, పట్టణ ప్రముఖులు

ఘనంగా లయన్స్ క్లబ్ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు

ప్రజాశక్తి - సాలూరు

పట్టణానికి చెందిన లయన్స్ క్లబ్ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని కెవిఆర్ ఎస్టేట్స్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్లబ్ సేవలను పలువురు వక్తలు కొనియాడారు. ముఖ్య అతిథులుగా హాజరైన హైకోర్టు జడ్జి చీకటి మానవేంద్రరాయ్, డిప్యూటీ సీఎం రాజన్నదొర క్లబ్ సేవలను మరింత విస్తరించాలని కోరారు. గిరిజన ప్రాంతంలో సేవలు చేపట్టాలని జడ్జి జస్టిస్ మానవేంద్ర రాయ్ సూచించారు. మహిళలకు కూడా లయన్స్ క్లబ్ ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. డిప్యూటీ సిఎం రాజన్నదొర మాట్లాడుతూ విద్య, వైద్య రంగాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం వేలకోట్ల రూపాయల ఖర్చు చేస్తోందని చెప్పారు. మెరుగైన విద్య, వైద్యం లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు కె.వెంకటరావు, ఉపాధ్యక్షులు జర్జాపు సూరిబాబు, సీనియర్ సభ్యులు సిగిరెడ్డి అప్పారావు దొర, ఎస్పీ రవిప్రకాష్ పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ మాయాజాలం

తిప్పికొట్టిన వినియోగదారులు

ప్రజాశక్తి - కురుపాం

ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి చేసే మాయా జాలాన్ని వినియోగదారులు తిప్పికొట్టి వారికి కేటాయించిన పార్కులు, కాలువలు, రోడ్లను కాపాడుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రంలో సాయిబాలాజీ రియల్ ఎస్టేట్ సంస్థ సుమారు రెండు దశాబ్దాల క్రితం లే అవుట్ వేసింది. అప్పుడు స్థలాన్ని అమ్మేందుకు లే అవుట్‌లో రెండు పార్కులు, సిమెంట్ కాలువలు, విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని చెప్పి స్థలాన్ని అమ్మకాలు చేశారు. కురుపాంలో భూమి ధరలకు రెక్కలు రావడంతో అత్యాశకు పోయిన సదరు రియల్ ఎస్టేట్ అవుట్‌లో పార్క్, రహదారులను అమ్మేందుకు బేరం కుదుర్చుకున్న సమయంలో విషయం బయటకు రావడంతో ఇప్పటికే ఇళ్లు నిర్మించుకున్నవారు, మిగిలిన వారంతా రియల్ వ్యాపారిని నిలదీశారు. ఆయన నుంచి సమాధానం సరిగా రాకపోవడంతో సాయి బాలాజీ రియల్ ఎస్టేట్‌లో స్థలాలు, ఇళ్లు కొన్నవారంతా ఐక్యమై అమ్మకాలు చేసేందుకు యత్నించిన పార్కులు, రహదార్లు అక్కడ వినియోగదారులు ఉమ్మడి ఆస్తి కనుక ఎవరూ కొనుగోలు, అమ్మకాలు చేయకూడదని హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ తరహా మోసం కురుపాంలో ఇష్టారాజ్యంగా మారింది. రియల్ ఎస్టేట్ భూములను కన్వర్షన్లు చేయకుండా ఇష్టారాజ్యంగా ఇళ్ల స్థలాలు అమ్ముతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదాయానికి గండి కొడుతున్నారు. అలాగే పంచాయతీకి రావాల్సిన ఆదాయం శూన్యం.. ఈ విషయమై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేసినా చర్యలు మొక్కుబడిగా చేపట్టి జేబులు నింపుకుంటున్నారన్న విమర్శలు లేకపోలేదు. రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు కూడా ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టేలా ఉన్నా తమ పర్సంటేజి తమకు వస్తే చాలన్నట్లు చట్టంలో లొసుగులు ఆధారంగా రిజిస్ట్రేషన్ కానిస్తూ కాసులు దండుకున్న పరిస్థితి నెలకొంది. ఇటీవల పూతికవలసలో ఓ రియలెస్టేట్ వ్యాపారులు ఓ గిరిజన ఉపాధ్యాయరాలికి రోడ్డు ఫేసింగ్ స్థలాన్ని అధిక ధరలు కు అమ్మకాలు చేసి స్థలం అప్పగించకపోవటంతో ఆమె పోలీసులు, రెవెన్యూ అధికారుల చుట్టూ తిరగాల్సి వచ్చింది. కురుపాంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదాయానికి గండి కొట్టే రియఎస్టేట్లపై రెవెన్యూ అధికారులు ఉక్కుపాదం మోపాలని స్థానికులు కోరుతున్నారు. లేకుంటే కొనుగోలుదారులంతా రోడ్డెక్కాల్సిన పరిస్థితి వస్తే అందరి అవినీతి బయటపడే అవకాశం లేకపోలేదని పలువురు చర్చిస్తున్నారు.



పార్కు, ఆట స్థలం కొనుగోలు చేయరాదంటూ బోర్డు పెడుతున్న వినియోగదారులు



అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న గుడ్లును పరిశీలిస్తున్న పీడీ విజయగౌరి

అంగన్వాడీ కేంద్ర్రాల్లో గుడ్లు పరిశీలన

'ప్రజాశక్తి 'వార్తకు స్పందన

ప్రజాశక్తి - కురుపాం

అంగన్‌వాడీ కేంద్రాలకు కుళ్లిపోయిన, చిన్న గుడ్లు సరఫరాపై 'ప్రజాశక్తి'లో ఆదివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు ఐసిడిఎస్ పీడీ కె.విజయగౌరి ఆదివారం కుళ్లిపోయి, చిన్నగుడ్లును పరిశీలించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణీలకు, బాలింతలకు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నప్పటికీ కేంద్రాలకు నాసిరకమైన గుడ్లు, బరువు తక్కువైనవి పంపిణీ జరుగుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపమా లేక చూసీ చూడనట్లు వ్యవహరించడం వల్ల గుడ్లు సరఫరా చేస్తున్న కాంట్రాక్టురు వద్దకు వెళ్లి గుడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీలకు నాసిరకమైన, చిన్న గుడ్లు సరఫరా చేస్తే తీసుకోవద్దని అంగన్వాడీ కార్యకర్తలకు సూచించారు. అలాగే సూపర్వైజర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని సూచించినట్లు తెలిపారు.

అథ్లెటిక్స్‌లో సత్తాచాటిన జయరాం

ప్రజాశక్తి-బొబ్బిలి

జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో ఎస్ఐబి కానిస్టేబుల్ జయరాం నాయుడు సత్తాచాటారు. పశ్చిమ బెంగాల్‌లోని మిడ్నాపూర్‌లో ఈ నెల 10 నుంచి 12 వరకు జరిగిన జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2023 పోటీల్లో 50 ప్లస్ విభాగంలో 5 కిలోమీటర్ల రేస్ వాకింగ్‌లో ఆయన ద్వితీయ స్థానంలో నిలిచారు. జయరాంను ఎస్ఐబి సిఐ ఆర్.జైభీమ్, సిబ్బంది అభినందించారు.

శివరాత్రికి పక్కాగా ఏర్పాట్లు : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పుణ్యగిరికొండపై ఈనెల 18న మహాశివరాత్రి, 19న జాగరణ స్నానాలకు వచ్చే యాత్రికులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆర్‌డిఒ ఎం.వి.సూర్యకళ, డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు.. దేవాదాయ శాఖ, మండల అధికారులను ఆదేశించారు. పుణ్యగిరి కొండపై శివరాత్రి ఏర్పాట్లను ఆదివారం ఆర్‌డిఒ, డిఎస్‌పి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు పలు పాయింట్లను పరిశీలించారు. వాష్ రూములను ఏర్పాటు చేయాలని, మెట్లు జారుడుగా లేకుండా చూడాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి మహాశివరాత్రి జాతరను విజయవంతం చేయాలని కోరారు. పుణ్యగిరి విశిష్టతను ట్రస్టుబోర్డు చైర్మన్ రామకృష్ణ తెలియజేశారు. ఆలయ అర్చకులు మణిశర్మ వేద ఆశీర్వచనం అందించారు. వీరి వెంట సిఐ సింహాద్రి నాయుడు, తహశీల్దార్ డి.శ్రీనివాసరావు, ఎస్ఐ జె.తారకేశ్వరరావు, దేవాదాయ శాఖ ఇఒ నాగేంద్ర, పంచాయతీ ఇఒ పాత్రో, మేస్త్రీ నానిగిరి కృష్ణ తదితరులు ఉన్నారు.

'స్వజల' కోసం ఎదురు-చూపులు

- నత్తనడకన పనులు
- దాహార్తితో అలమటిస్తున్న శివారు కాలనీవాసులు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్


నియోజకవర్గం పరిధిలోని పార్వతీపురం మండలానికి చెందిన 14గ్రామాలతో పాటుగా వెంకంపేట పంచాయతీకి చెందిన శివారు కాలనీలై వైకెఎం నగర్, మజ్జిగౌరి, అధికారుల కాలనీల్లో ప్రజలు స్వజల పథకం ద్వారా తాగునీటి కోసం ఎదురు చూస్తున్నారు. ఈ ప్రాంత ప్రజల దాహార్తిని తీర్చేందుకు స్వజల పథకం ద్వారా రూ.527లక్షలతో 2019లో అప్పటి ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా, కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో ఈ పనులు నత్తనడకన నడుస్తూ నాలుగేళ్లుగా కొనసాగుతూనే ఉంది. ఈ పథకంలో భాగంగా వెంకంపేటలోని విశాఖ డైరీ వెనుక భాగంలో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మించి, కాలనీల్లో పైపులైను కూడా వేశారు. గత జనవరిలో వీధుల్లో కుళాయిలు బిగించారు. దీంతో కాలనీ ప్రజలు తమకు తాగునీటి సమస్య తీరనుందని భావించారు. అయితే కుళాయిలో బిగింపులు జరిపినప్పటికీ వేసవి సమీపిస్తున్నా పథకం ప్రారంభమయ్యే సూచనలు కనిపించడంలేదు. ఈ విషయమై గ్రామీణ నీటి సరఫరా అధికారులను సంప్రదించగా పథకం పూర్తికాక పోవడానికి కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లింపులు జరపకపోవడంతో జాప్యం చేస్తున్నారన్నారు. ఈ విషయం పై అధికారులకు నివేదించి, ఈ వేసవిలోనైనా తాగు నీరందించేందుకు కృషి చేస్తామని చెబుతున్నారు. జిల్లా అధికారులు ఈ విషయమై వెంటనే స్పందించి చర్యలు చేపట్టి ఈ వేసవిలో నీటి ఎద్దడి లేకుండా, తాగునీరందిస్తారన్న కొండ ఆశగా కాలనీవాసులు ఎదురుచూస్తున్నారు.

రెండేళ్లకే మూలపడ్డ రక్షితమంచినీటి పథకం

వీరఘట్టం : తమ గ్రామానికి తాగు నీరొచ్చి రెండేళ్లయ్యిందని, ఆ తర్వాత రక్షితమంచినీటి పథకం మూలకు చేరిందని మండలంలోని హుస్సేన్ పురం సచివాలయం పరిధి కొంచ గ్రామానికి చెందిన ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని వండువ ఉపరితల రక్షిత మంచినీటి పథకం ద్వారా తమ గ్రామానికి తాగునీరు సరఫరా కావాల్సి ఉందన్నారు. పథకం ప్రారంభించి ముచ్చటగా మూడు రోజులు తాగునీరు సరఫరా అయ్యిందని, అప్పటి నుంచి దాదాపుగా రెండేళ్లు కావస్తున్నా ఇప్పటికీ కుళాయి పాయింట్ ద్వారా చుక్క నీరు రాకపోవడంతో తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు గురవుతున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో సుమారు వంద కుటుంబాలు గల ఈ గ్రామంలో రెండు బోరు బావులు ఉన్నప్పటికీ అందులో ఒక దాని నుంచి వచ్చే నీరు తాగేందుకు పనికి రాకపోవడంతో ఉన్న ఒక్క బోరుపైనే ఆధారపడి కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వేసవి ఆరంభం కావడంతో నీటి కోసం మరిన్ని అవస్థలకు గురి కావాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ గ్రామానికి తాగునీరు సరఫరా అయ్యేలా తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ఉత్సవ విగ్రహంలా ఉన్న మంచినీటి పథకం



మజ్జిగౌరి కాలనీలో ఏర్పాటు చేసిన ట్యాపులు

పాలకొండలో తాగునీటికి కటకట

పాలకొండ : నగర పంచాయతీలో తాగునీటి సమస్యలు కొంతకాలంగా పట్టిపీడిస్తున్నాయి. వేసవి వస్తే పట్టణంలో పలు ప్రాంతాల్లో నీటి ఎద్దడి తీవ్రంగానే ఉంది. పట్టణంలో 4 రక్షిత మంచినీటి పథకాలున్నా పూర్తిస్థాయిలో నీరందడం లేదు. నిత్యం సాంకేతిక సమస్యలు ఎదురై నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. సుమారు 40వేల జనాభా ఉన్న ఈ ప్రాంతంలో నీటి సమస్య పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించడం లేదు. వేసవి వస్తే దాహంతో పలు ప్రాంతాల్లో ప్రజలు తాగునీటికోసం పరుగులు పెడుతున్నారు. ఎన్నో ఏళ్ల క్రితం వేసిన పైపులైన్లు కారణంగా ఎక్కడికక్కడ లీకులు ఉండడంతో పూర్తిస్థాయిలో నీరు సరఫరా కావడం లేదు. నాన్ అమృత పథకం మంజూరైనప్పటికీ ఇంత వరకూ ఆ పనులు ప్రారంభం కాలేదు. దీంతో పట్టణ వాసులకు నీటి కోసం ఏటా ఇబ్బందులు తప్పడం లేదు. పట్టణంలో బల్లంకివీధి, కుమ్మరివీధి, కోమటిపేట, భోనంవీధి, రెల్లివీధి, ఎన్ఎస్ఎన్ కాలనీ, ఇందిరానగర్‌కాలనీ తదితర ప్రాంతాల్లో నీటి సమస్య నిత్యం ఎదురవుతుంది. ఆశించిన స్థాయిలో నీటిసరఫరా కాకపోవడంతో మహిళలు నీటికోసం పరుగులు పెడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటికొరత లేకుండా చూడాలని పట్టణవాసులు కోరుతున్నారు.



మెయిన్ పంపు నుంచి నీరు పట్టుకుంటున్న కాలనీ వాసులు

ఉపాధ్యాయులపై ఒత్తిడి చేయొద్దు

ఎమ్మెల్సీ రఘువర్మ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉపాధ్యాయులపై ఉన్నతాధికారుల ఒత్తిడి మానుకోవాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పి.రఘువర్మ అన్నారు. ఆదివారం నగరంలోని లక్క పందిరి వీధిలోగల ఎపిటిఎఫ్ భవనంలో షేక్ బుఖారి బాబు అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పుల భానుమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ రాష్ట్రంలోను, జిల్లాలోను ఉపాధ్యాయులపై ఏదో ఒక కారణం చూపి ఉన్నతాధికారులు ఒత్తిడి చేయడాన్ని ఖండించారు. అధికారుల తీరు ఉపాధ్యాయుల బోధనకు ఆటంకం కలిగించే విధంగా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పి. శ్రీనివాస్, ఉపాధ్యక్షులు సంపూర్ణ లత, పిల్లా తిరుపతి , నల్లా రవికుమార్, రాష్ట్ర కౌన్సిల్ రవి గౌరవ అధ్యక్షులు జోగినాయుడు, మద్రాపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అండర్-15 రాష్ట్ర స్థాయి పోటీలకు చెస్ క్రీడాకారుల ఎంపిక

విజయనగరం టౌన్: అండర్ 15 ఓపెన్ చదరంగం రాష్ట్ర పోటీలకు జిల్లా ఆదివారం జరిగిన సెలక్షన్ విభాగంలో బాలుర విభాగంలో కాండ్రేగుల ప్రహ్లాద్, అక్కివరపు పర్వేష్, సత్యసాగర్ నాయుడు, జూలూరు భాను కార్తికేయను, బాలికల విభాగంలో అక్కివరపు జాస్మిన్, అట్టాడ దీక్ష శ్రీ, అట్టాడ ధనుశ్రీ , కుందన ప్రియలను రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపిక చేశారు.దీనికి చీఫ్ ఆర్బిటర్ గా సైదా బేగం మరియు డిప్యూటీ ఆర్బిటర్ గా శ్రీనివాస్ రావు వ్యవహరించారు, అని విజయనగరం జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి కె వి. జ్వాలాముఖి గారు తెలియజేశారు.


ఒక చోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ప్రజాశక్తి - కురుపాం

వారంతా పూర్వ విద్యార్థులు... తలోకోట తలోదారి ఎంచుకొని ఉన్నత స్థానాల్లో ఉన్నారు. వాళ్ళ ఎవరో కాదు... స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 1975లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు వారంతా ఆదివారం వారు చదువుకున్న పాఠశాల వద్ద ఆత్మీయ కలయిక ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారంతా 45ఏళ్ల తర్వాత కలవడం చిరకాల స్వప్నం నెరవేరిందని వారు అభిప్రాయపడ్డారు. బెంగుళూరు, హైదరాబాద్, విశాఖపట్నం, శ్రీకాకుళం లాంటి దూరప్రాంతాల నుంచి అప్పటి 60 మంది పూర్వ విద్యార్థులు కుటుంబాలతో సహా హాజరయ్యారు. వీరిలో వైద్యాధికారి కిరణ్ కుమార్, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా రెండుసార్లు పదవి బాధ్యతలు స్వీకరించిన వి.కృష్ణచంద్, జిల్లా హ్యూమన్ రైట్స్ అధ్యక్షులుగా ఎన్నికైన జి.వెంకటరావుతో పాటు తోటి మిత్రులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అప్పటి టీచ్ గురువులు నెమరువేసుకుని ఇలా 45 ఏళ్ల తర్వాత అందరూ ఒక చోట కలవడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమాన్ని కొత్తకోట విశ్వనాథం, గోటారి వెంకటరావు, గోవిందా కృష్ణారావు, కె.కోటేశ్వరరావు, వెంకట సన్యాసిరాజు నిర్వహించారు.


పైపు లు పాడైపోవడంతో వృథాగా పోతున్న తాగునీరు

రోడ్ల విస్తరణ పనుల్లో పాడైన తాగునీటి పైపు

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

తోటపల్లి నుండి కురుపాంకు వెళ్లే ఆర్ అండ్ బి రహదారి పనుల్లో మండలంలోని పెదమేరంగి జంక్షన్‌లో నిర్వహిస్తున్న రోడ్డు విస్తరణలో తాగునీటి పైపు శుక్రవారం తెగిపోయింది. పెదమెరంగి జంక్షన్లో జెసిబితో పనులు నిర్వహిస్తుండగా చినమేరంగికి వెళ్లే తాగునీటి పైపు తెగిపోయింది. చిన్నమేరంగికి తాగునీటి సౌకర్యం కోసం పెదమేరంగి జంక్షన్ సమీపంలో ఏర్పాటు చేసి పైప్‌లైన్‌ను చినమేరంగి వరకు వేసి ఉన్నారు. రహదారి విస్తరణ పనుల్లో జెసిబితో రహదారిని తవ్వుతుండగా పైప్‌లైన్ తెగిపోయింది. దీంతో చినిమారంకు వెళ్లే తాగునీరు పూర్తిగా రహదారిపై పాడుతుంది. దీంతో పెదమేరంగి జంక్షన్ బురదమయంగా మారింది. చిన మేరంగిలో తాగునీటి కోసం ఇబ్బంది పడాల్సిన పరిస్థితిలో ఏర్పడ్డాయి..


కాలువల నుంచి రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

కంపుకొడుతున్న వీధులు

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణంలో పారిశుధ్యం అధ్వాన్నంగా ఉంది. పారిశుధ్య పరిస్థితి రోజు రోజుకు మరింత క్షీణిస్తుంది. డివిజన్ కేంద్రమైన పాలకొండ పట్టణంలో పారిశుధ్య నిర్వహణపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టిన దాఖలాల్లేవు. ప్రధాన రహదారితో పాటు పలు వీధుల్లో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. పట్టణంలో రామకళామందిర్ ప్రాంతంలో అపరిశుభ్రత తాండవిస్తుంది. కాలువలో పూడికతీతలు తీయకపోవడంతో రోడ్డు మీదే మురుగునీరు పారుతుంది. అక్కడ ఉన్న తాగునీటి కుళాయి దగ్గర కూడా పారిశుధ్యం అధ్వాన్నంగా ఉండడంతో తాగునీరు పట్టుకోలేని పరిస్థితిలో స్థానికులు ఉన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తాగునీటి బోరుకు మరమ్మతులు


ప్రజాశక్తి - భామిని

మండలంలోని బిల్లుమడా పంచాయతీ పరిధిలో గల రజక వీధిలో చేతి బోరుకు సర్పంచ్ సిగడాన రాధాకృష్ణ ఆధ్వర్యంలో మండల బోర్ వెల్ సిబ్బంది మరమ్మతులు చేశారు. రానున్న వేసవి నేపథ్యంలో పంచాయతీలో ఎక్కడా నీటి ఎద్దడి లేకుండా బోర్లకు మరమ్మతులు చేస్తున్నామని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో వైసిపి మండల సోషల్ మీడియా కన్వీనర్ ఇళ్ల శ్రావణ్ కుమార్ ఉన్నారు.

పెదంకలాంలో సీతారాముల ఆలయ ప్రతిష్ట

ప్రజాశక్తి - సీతానగరం

ఎంపిపి బలగ రమణమ్మ స్వగ్రామమైన పెదఅంకలాంలో సీతారాముల ఆలయ ప్రతిష్ట ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు హాజరయ్యారు. ఇటీవల కొత్తగా పునః నిర్మాణం చేసిన ఆలయం ప్రతిష్ఠా మహోత్సవ క్రతువును గత రెండు రోజులుగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వాకాడ నాగేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యులు మామిడి బాబ్జీ, వైసిపి మండల అధ్యక్షులు బొంగు చిట్టిరాజు, బలగ శ్రీరాములు నాయుడు, సర్పంచ్ బలగ శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ తెంటు వెంకట అప్పల నాయుడు, ఎంపిపి కొట్నాన రత్నాకర్, సీనియర్ నాయకులు ఆర్‌వి, పోల ఈశ్వరనారాయణ, వి.గురురాజు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే జోగారావును సన్మానిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

జీడిపై చిగురిస్తున్న ఆశలు

గిట్టుబాటు ధరపైనే గిరిజన రైతుల దిగులు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో ఈ ఏడాది జీడితోటలు విరబూశాయి. దీంతో జీడి రైతులకు ఆశలు చిగురిస్తున్నాయి. మూడేళ్లుగా రైతులు కరోనాతో నష్టపోయారు. ఈ ఏడాదైనా సకాలంలో పంటలు వస్తే చేసిన అప్పుల తీరుతాయని భావిస్తున్నారు. పూత నిలబడి పిక్కలు బాగా కాస్తే అప్పులన్నీ తీరిపోతాయని ఆశగా ఉన్నారు. గత నవంబర్, డిసెంబర్లోనే జీడిపూత రావడంతో పంట దిగుబడి బాగా వస్తుందనే అంచనాలో ఉన్నారు. జనవరి, ఫిబ్రవరిల్లోనూ పూత మరింత విరబూయడం, మంచు అంతంతమాత్రంగా ఉండడంతో కాపుపైన కొండంత ఆశలు పెట్టుకున్నారు. మరోవైపు జీడి పిక్కలు దిగుబడి ఉన్నా గిట్టుబాటు ధర వస్తుందో రాదోననే అనుమానాలు రైతులను వెంటాడుతున్నాయి. దళారుల వ్యవస్థ అధికంగా ఉండడంతో రైతులు గిట్టుబాటు ధర పొందలేకపోతున్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని పిక్కలను గిరిజన సహకార సంస్థ ద్వారా కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పిస్తే తాము పడ్డ కష్టానికి, చేసిన అప్పులకు ప్రతిఫలం ఉంటుందని వారు భావిస్తున్నారు. కాపుబాగా కాసిందన్న సంతోషం ఉన్నా భవిష్యత్‌లో గిట్టుబాటుధర లేకపోవడం, వ్యాపారులు, దళారుల ప్రమేయంతో ఉంటుందన్న బాధ వారిని వెంటాడుతోంది.

ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలి

పంట బాగా పండడానికి పూత సమయంలో పువ్వు పింజికి పురుగు పట్ట కుండా రాలకుండా ఉండడానికి ఎరువులు స్ప్రే నిమిత్తం పెద్ద


విరబూసిన జీడి చెట్టు

మొత్తంలో ఖర్చు చేశాం. ఈ ఏడాది ముందుగానే విరివిగా పూత వచ్చింది. పంట చేతి కొచ్చినా దళారుల చేతుల్లో మోసపోతున్నాం. కావున ప్రభుత్వం చొరవ తీసుకొని పంటను జిసిసి ద్వారా కొనుగోలు చేసి గిరిజన రైతులను ఆదుకోవాలి.

ఆరిక ఇండియా,
గిరిజన రైతు,గొంది లోవ .

గెడ్డ కప్పేస్తున్నా అధికారులకు పట్టదా?

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

పట్టణం నడిబొడ్డున ప్రవహిస్తున్న వరహాలు గెడ్డను ఎక్కడికక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారులు అనువైన చోటల్లా కలిపేసుకుని కబ్జాలకు పాల్పడుతుంటే నీటిపారుదల శాఖ, మున్సిపల్ అధికారులు గుడ్డప్పగించి చూస్తున్నారని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు వి.దాలినాయుడు, సభ్యులు ఆరోపించారు. ఆదివారం బెలగాం శివారులో వరహాలగెడ్డ ఉపకాలువకు సంబంధించిన స్థలాన్ని భవననిర్మాత ఒకరు అనుమతులు లేకుండా పూడ్చేసి యథేచ్ఛగా నిర్మాణానికి ఉపక్రమిస్తున్న స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ నడిబొడ్డున ప్రకృతి ప్రసాదంగా వరద నీరు ప్రవహించేందుకు ఏర్పాటైన వరహాల గెడ్డను కబ్జాదారులు కబ్జా చేస్తున్నారన్నారు. పూర్తిగా కనుమరుగయ్యేలా చేస్తున్నారన్నారు. కళ్ల ముందే ఈ తతంగం జరుగుతున్నప్పటికీ సంబంధిత రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీ, ఇరిగేషన్ ఆయా శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది కళ్లు మూసుకుని గుడ్డిపాలన వ్యవహరిస్తున్నారన్నారు. ఇదే అదునుగా కబ్జాదారులు కోట్లాది రూపాయల విలువచేసే ప్రభుత్వ గెడ్డను ఆక్రమిస్తున్నారన్నారు. జిల్లా కేంద్రం కావడంతో స్థలాలకు రేట్లు పెరగడంతో కబ్జాదారులు తమ ఇష్టానుసారంగా కబ్జా చేస్తున్నారన్నారు. అయినప్పటికీ సంబంధిత అధికారుల్లో చలనం లేదన్నారు. ఇదంతా చూస్తుంటే సంబంధిత అధికారుల అండదండలతోనే కబ్జా జరుగుతుందన్న అనుమానం కలుగుతుందన్నారు. తక్షణమే వరహాలు గెడ్డ సరిహద్దులను గుర్తించి గెడ్డను రక్షించాలన్నారు లేదంటే వర్షాకాలంలో గెడ్డలో ప్రవహించాల్సిన వరదనీరు పట్టణంపై పడి ముంపునకు గురి చేసే ప్రమాదం ఉందన్నారు.

ఏనుగుల పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి -భామిని

ఇటీవల ఒడిశా నుంచి వచ్చి గత వారం రోజులుగా మనుమకొండ పంచాయతీ పరిధిలో ఆరు ఏనుగుల గుంపు సంచరిస్తున్నాయని, కావున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైసిపి మండల కన్వీనర్ తోట సింహాచలం గ్రామస్తులకు సూచించారు. ఆదివారం ఆయన మండలంలోని మనుమకొండ పంచాయతీలో ఏనుగుల గుంపు సంచరిస్తున్న గ్రామస్తులను పరిశీలించారు. ఈ ప్రాంతం పూర్తిగా గిరిజనులే ఉన్నారని, ఉదయం పూట పొలాలకు, జీడి, మామిడి తోటలు కాపుకు వెళ్తుంటారని అన్నారు. అలాగే పోడు వ్యవసాయం చేసే వారు, పొలం పనులు చేసే రైతులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసి, జాగ్రత్తలు తీసుకోవాలని అటవీశాఖ, బీట్‌ఆఫీసర్లకు సూచించారు. మనుమకొండ పంచాయతీ పరిధిలో గల కొత్తూరు గూడ, పకుడు భద్ర, మనుమకొండ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏనుగులు వద్దకు వెళ్లి వీడియో, సెల్ఫీలకు ప్రయత్నించొద్దని, అటవీ సిబ్బందికి గ్రామస్తులు సహకరించాలని కోరారు. అలాగే స్థానిక ప్రజా ప్రతినిధులు బాధ్యతాయుతంగా ప్రజలను అప్రమత్తం చేయాలని కోరారు. ఈ పరిశీలనలో వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు కోపరేటివ్ డైరెక్టర్ అర్లి రాజశేఖర్, వైసిపి నాయకులు సిడగంటి రామారావు ఉన్నారు.

అందరికీ ఆదర్శంగా నిలవాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

కళింగ వైశ్య సంఘం అందరికీ ఆదర్శంగా నిలవాలని ఆ సంఘం కార్పొరేషన్ చైర్మన్ అందవరపు సూరిబాబు సంఘ సభ్యులకు సూచించారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలోని చంద్రమౌళీశ్వరి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కళింగవైశ్య సంఘ సమావేశంలో మాట్లాడారు. సంఘం ప్రతిష్టకు అంతా కృషి చేయాలని, అలాగే ఎవరైనా పేదలుంటే వారికి సంక్షేమ పథకాలు అందకపోతే తమ దృష్టికి తీసుకొస్తే సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు. వీరఘట్టంలో నిర్మించనున్న కల్యాణ మండపం ఆహ్లాదకరంగా ఉండేలా పనులు చేపట్టాలని, అలాగే పార్కింగ్ కూడా ఉండేలా చూడాలని అన్నారు. కల్యాణమండపం నిర్మాణానికి తమ వంతు సహాయం అందించనున్నట్లు తెలిపారు. అందరూ ఐక్యమత్యం ఉండి సంఘం బలోపేతానికి కృషి చేయాలని అన్నారు. తక్కువ సమయంలోనే నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. విద్య, వైద్యంలో కొనసాగిస్తున్న విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించేందుకు తోడ్పడాలన్నారు. అలాగే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో కళింగ వైశ్య సంఘం కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో పాటు ఎమ్మెల్సీ పదవి ఇస్తానని హామీ ఇచ్చారని ఆ హామీ నెరవేర్చేందుకు ఎమ్మెల్సీ


సంఘీభావం తెలుపుతున్న కళింగ వైశ్యులు

పదవి ఇవ్వాలని తీర్మానం చేశారు. అంతకుముందు కమ్యూనిటీ హాలు స్థలాన్ని పరిశీలించారు. అనంతరం చైర్మన్‌కు సంఘ సభ్యులు దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు అంధవరపు కోటేశ్వరరావు, డైరెక్టర్ మొహర ప్రసాద్, మండల అధ్యక్షులు కె.ఆంజనేయులు, ఉపాధ్యక్షులు వి.శ్రీనుబాబు, కార్యదర్శి భోగి లతా మాణిక్య చంద్రశేఖర్‌తో పాటు జి.గౌరీశంకర్, వి.శ్రీనివాసరావు, బి.సుధాకర్, జి.మురళి, జి.ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో దుష్ట పరిపాలన : టిడిపి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఆనాడు పాదయాత్రలో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి అయ్యాక ఏ ఒక్కటీ నెరవేర్చకుండా ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి రాష్ట్రంలో దుష్ట పరిపాలనను ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కొనసాగిస్తున్నారని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, టిడిపి సీనియర్ నాయకులు దత్తి లక్ష్మణరావు విమర్శించారు. గరుగుబిల్లి మండలం చిలకాంలో ఇదేం కర్మ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, మహిళలు, యువతకు ఉపాధి అవకాశాలు ఇవ్వకుండా పూర్తిగా అణగదొక్కారని విమర్శించారు. రాష్ట్రంలో రోజురోజుకు పెరుగుతున్న నిత్యవసరాలతో ప్రజలపై ఆర్థిక భారం పడుతుందన్నారు. చరిత్రలో ఇటువంటి ముఖ్యమంత్రిని ఎక్కడా చూడలేదన్నారు. నియోజకవర్గంలో రాజులు నకిలీ ధ్రువీకరణ పత్రాలతో ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని పాలన సాగించారని విమర్శించారు. ఈసారి ఎన్నికల్లో స్వచ్ఛమైన గిరిజనుడ్ని గెలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.



చిలకాంలో ర్యాలీ చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజలు ఇప్పటికైనా మేల్కొని రానున్న ఎన్నికల్లో మంచి వ్యక్తులకు ఎన్నికల్లో ఓటు వేసి టిడిపిని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. అనంతరం బిసిసెల్ అధికార ప్రతినిధి, టిడిపి సీనియర్ నాయకులు ద్వారపురెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ నకిలీ రాజుల బెడద నుంచి విముక్తి కావాలన్నారు. 25 ఏళ్ల టిడిపి అభ్యర్థిని ఎమ్మెల్యేగా గెలిపించలేని వ్యక్తి విజయరామరాజు లేవలేని స్థితిలో ఈసారి పార్టీ, అభ్యర్థి గెలుపు కోసం పాటుపడుతున్నానని చెప్పడం హాస్యస్పదంగా ఉందన్నారు. కుటుంబంలో వ్యక్తిని మళ్లీ ఎమ్మెల్యేగా గెలుపు కోసమే విజయరామరాజు కొంతమందిని పావులుగా వాడుకుంటున్నారని విమర్శించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆశావాహులు బిడ్డిక పద్మావతి, పువ్వల లావణ్య, బిడ్డిక తమ్మయ్య, విజయ్‌కుమార్, భూపతి దొర, టిడిపి నాయకులు మీసాల శశి భూషణరావు, ఏగిరెడ్డి నారాయణరావు, రమణమూర్తి, మాజీ ఎంపిపి గౌరమ్మ, నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.


అగ్నిప్రమాదంలో దగ్ధమైన పూరిళ్లు

మోసూరులో రెండు పూరిళ్లు దగ్ధం

ప్రజాశక్తి పాచిపెంట

మండలంలోని మోసూరులో శనివారం అర్ధరాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో రెండు పూరిళ్లు పూర్తిగా దగ్ధమై రూ.40వేలు ఆస్తి నష్టం జరిగింది. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మోసూరులో కట్టపల్లి సుశీల, యామల పోలినాయుడు నివసిస్తున్న పూరింట్లో శనివారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం సంభవించి, పక్కన ఉన్న మరో ఇంటికి మంటలు అంటుకోవడంతో ఆ రెండు ఇళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఆదివారం ఉదయం దగ్ధమైన ఇళ్లను ఆర్ఐ రామచంద్రరావు, విఆర్ఓ చిన్నయ్య పరిశీలించారు. రూ.40 వేలు ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేశారు.



చదవడం మాకిష్టం కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు

విజ్ఞానాన్ని పెంచుకోవాలి

ప్రజాశక్తి -పాలకొండ రూరల్

గ్రంథాలయం ద్వారా లభించే పుస్తకాలను పాఠకులు సద్వినియోగం చేసుకొని విజ్ఞానాన్ని పెంచుకోవాలని ఇన్‌ఛార్జి గ్రంథాలయాధికారి బబ్బూరు గణేష్‌బాబు అన్నారు. పాలకొండ శాఖాగ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయంలో లభించే విలువైన పుస్తకాన్ని చదివి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్స్ రీడర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

శృంగవరపుకోట: పట్టణంలోని గొల్లవీధికి చెందిన వారాది గణేష్ (28) అనే యువకుడు పురుగుల మందు తాగిన ఘటనలో చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడని ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం... పట్టణంలోని గొల్లవీధికి చెందిన వారాది గణేష్ ఓ ప్రయివేటు కళాశాల క్యాంటీన్‌లో వర్కర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 10వ తేదీన అధికంగా మద్యం సేవించి ఇంటికి రావడం వల్ల భార్య మందలించింది. ఆ కోపంతో గణేష్ పురుగుల మందు తాగాడు. వెంటనే స్థానికులు పట్టణంలోని ఏరియా ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం విశాఖపట్నంలోని కెజిహెచ్‌కి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మరణించాడు. గణేష్ భార్య నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. గణేష్‌కు ఇద్దరు కుమారులున్నారు.


పార్కును పరిశీలిస్తున్న జిసిసి ఎమ్‌డి సురేష్‌కుమార్

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్‌లో ఆదివారం సెలవు దినం కావడంతో పర్యాటకులు ఉల్లాసంగా ఉత్సాహంతో గడిపారు. పార్కులో ఉన్న అందాలను ఆస్వాదించారు. చిన్నారులు మినీ ట్రైన్ ఎక్కి సరదాగా గడిపారు. యువత హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడిచి వెళ్లారు. కొంతమంది పర్యాటకులు విలువిద్య, గన్ షాట్ షూటింగ్ చేశారు. ఆనంద విహార వద్ద డాన్సులు వేసి ఉల్లాసంగా ఉత్సాహంతో కేరింతలు కొట్టారు. జెయింట్ వీల్ ఎక్కి ఉయ్యాలో ఊగారు అనంతరం మెట్టిగూడ జలపాతాన్ని సందర్శించారు. ఈ ఆదివారం జిసిసి మేనేజింగ్ డైరెక్టర్ సురేష్‌కుమార్ దంపతులు పార్క్‌ను తిలకించారు.

వ్యవసాయంలో పెరుగుతున్న డ్రోన్ల ప్రాధాన్యత

వినియోగంలో మెలకువలు, అవగాహన అవసరం
విజయనగరం జిల్లా ఏరువాక కేంద్రం సభ్యులు ప్రసాదరావు

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

దేశీయ డిమాండ్ ప్రకారం 1950లో 36.1 కోట్ల జనాభాకు 295.87 మిలియన్ టన్నుల ఆహార ఉత్పత్తి పెంచిందని, ముమ్ముందు పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి ప్రస్తుత స్థాయి నుంచి 2050 నాటికి భారత్ వార్షిక ఉత్పత్తులు 300 టన్నుల ఉత్పత్తి పెంచాలని విజయనగరం జిల్లా ఏరువాక కేంద్రం సభ్యులు ఖండాపు ప్రసాదరావు స్పష్టం చేశారు. ఒక పక్క రుతుపవనాలు ఆగమన, తిరోగమన వ్యత్యాసాలు, దాని వల్ల వచ్చే అకాల వర్షాలు, శీతోష్ణస్థితి ఉల్లంఘన, వ్యవసాయ కార్మికుల కొరత, ఉత్పాదికులను ఎక్కువగా ఉపయోగించడం, తద్వారా సాగు ఖర్చులు విపరీతంగా పెరగడం వంటి అంశాలు రైతులను, వ్యవసాయ రంగాన్ని అస్థిర పరుస్తున్నాయన్నారు. సమయం ఆదా, వనరుల వినియోగాన్ని తగ్గించి సాంకేతికాలు అభివృద్ధి చెందకపోతే దేశ ఆహార భద్రతకు భంగం వాటిల్లేలా వ్యవసాయ రంగాన్ని ప్రతికూలంగా ప్రభావితం చేస్తాయన్నారు. ఆహారం, వాణిజ్య పంటలకు తరచూ చీడ పురుగులు సోకుతుండడం వల్ల ఎప్పటికప్పుడు వాటి నివారణకు రసాయనాలు స్ప్రే చేయాల్సి ఉంటుందన్నారు. అలాగే పంటలపై పైపాటు

వినియోగంలో జాగ్రత్తలు

వ్యవసాయ డ్రోన్ వాడకంలో ఆరంభం ఖర్చు చాలా ఎక్కువ. ఒక యూనిట్ దాదాపు రూ.5- 10 లక్షలు అవ్వొచ్చు. డ్రోన్, జనరేటర్, సెట్స్, బ్యాటరీస్, ట్రాలీ మోసుకెళ్లడానికిఉండాలి. దీన్ని ఆపరేట్ చేయడానికి క్రాస్ లాండింగ్, డ్రోన్ తప్పిపోకుండా ఉండానికి శాస్త్రీయంగా శిక్షణ పొందిన పైలట్ అవసరం. దీన్ని ఉపయోగించడానికి అన్ని రకాల ప్రభుత్వ క్లిరెన్స్, డైరెక్టర్‌లో సివిల్ ఆవిగేషన్ నుంచి అనుమతులు ఉండాలి. తీవ్రమైన వాతావరణ పరిస్థితుల్లో దీన్ని ఎగరవేయడం కష్టం. సాంకేతిక అంశాల కోసం విజయనగరం ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.లక్ష్మణ, శాస్త్రవేత్తలు ఎం.స్వాతి, డాక్టర్ కె.తేజేశ్వర రావును సంప్రదించాలన్నారు.


వ్యవసాయ పనుల కోసం ఉపయోగిస్తున్న డ్రోన్

పోషకాలను సేంద్రీయంగా అందించడం, అనవసరంగా ఇటీవల విరివిగా ఉపయోగిస్తున్న డ్రోన్ల ద్వారా ఆ సమస్యకు ఒక చక్కటి వినియోగమని ఆయన అన్నారు.

డ్రోన్ల పరికరం సాధారణగా రేడియో తరంగాల నియంత్రణ ద్వారా నిర్వహించబడుతుందన్నారు. ఏదైనా లోపం లేదా ప్రమాదకరమైన పరిస్థితి సంభవించినప్పుడు, ఏదైనా అడ్డం వచ్చినప్పుడు దాన్ని మానవీయంగా పైలట్ చేయవచ్చు అన్నారు. వ్యవసాయ డ్రోన్లు అనేది పంటల ఉత్పత్తి పెంచడానికి, పంటల పెరుగుదలను పర్యవేక్షించడానికి, వ్యవసాయానికి వర్తించే మానవరహిత వైమానిక వాహనం, సెన్సార్లు, డిజిటల్ ఇమేజింగ్ సామర్థ్యాలు రైతులను వారి క్షేత్రాల చిత్రాన్ని ఇవ్వగలవు. పంట దిగుబడి వ్యవసాయ సామర్థ్యాన్ని రైతులకు వారి క్షేత్రాలు యొక్క గొప్ప చిత్రాన్ని

వ్యవసాయంలో డ్రోన్ వల్లన ప్రయోజనాలు

1) వ్యవసాయ డ్రోన్ టెక్నాలజీతో విత్తనాలు, ఎరువులు వేయడం, పురుగు తెగుళ్ల కలుపు మందులు, ద్రవ లేదా నీళ్లలో కరిగిపోగల ఎరువులు పిచికారీ చేయవచ్చు
2)10 లీటర్ల సామర్థ్యం గల డ్రోన్ లో 1 ఎకరాన్ని 6-10 నిముషాల్లో 6.5 కిమీ ల ఎకరా, 6.1 కిమి పంట మీద ఎత్తులో పిచికరి చేయవచ్చు.
3) వ్యవసాయ డ్రోన్ తో పిచికరీ తక్కువ ఖర్చుతో కూడుకున్నది మరియు 90 శాతం నీటిని మరియు 95 శాతం సమయాన్ని అదా చేయవచ్చు.
4)నెల తిమ సెన్సార్ లతో కూడిన డ్రోన్లు ఒకే క్షేత్రం లోని ఏ భాగాలకి ఎక్కువ నీరు అవసరమో గుర్తించగలవు మరియు తద్వారా నీటి పారుదల ఆటో మేషన్కు సహాయ పడుతుంది.
5) హెూమ్ బటన్ నొక్కితే మనం ఎక్కడ నుండి టేక్ ఆఫ్ చేశామో మళ్ళీ అక్కడికి తిరిగి రాగలదు.
6) డ్రోన్ తో పిచికారి మందు మొక్క మోను భాగం, మధ్య భాగం మరియు కింద భాగంలో సంప్రదాయ పిచికారీ యంత్రాలు కంటే మెరుగుగా తడుపుతుంది.

ఇవ్వగలవని అన్నారు. వ్యవసాయంలో డ్రోన్ టెక్నాలజీతో విత్తనాలు, ఎరువులు వేయడం, పురుగు, తెగుళ్ళ, కలుపు మందులు, ద్రవ లేదా నీళ్లలో కరిగిపోగల కలుపు మందులు, పంట పర్యవేక్షణ, నీటి వనరుల అభివృద్ధి ప్రణాళిక, ఆ దేశ ప్రాంతాల సర్వే, పంట క్షేత్రాల 3- డి మ్యాపింగ్, ఖచ్చిత వ్యవసాయ సాంకేతికతను రైతులకు చెరవేయవచ్చు అన్నారు.